ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
గురువారం 4 జనవరి 2024

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి 8

బాబోయ్.. కుక్కలు 8

వీఆర్ఏలకు ఊరట



మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న పూర్వ వీఆర్ఏల జేఏసీ

- వేతనాలు, ఎంప్లాయ్ ఐడీలపై సర్క్యులర్ జారీ
- ఐదు నెలలుగా జీతాల కోసం ఎదురు చూసిన ఉద్యోగులు
- జిల్లాలో 372 మందికి తీరిన వెతలు
- మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపిన పూర్వ వీఆర్ఏ జేఏసీ

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

గత ప్రభుత్వంపై పోరాడి ఉద్యోగాలను క్రమబద్ధీకరించుకున్న విలేజీ రెవెన్యూ అసిస్టెంట్‌ల(వీఆర్ఏ)కు కాంగ్రెస్ ప్రభుత్వం ఊరటనిచ్చింది. వేతనాలు, ప్రభుత్వ గుర్తింపు కార్డులు లేక ఐదు నెలలుగా అనేక వెతలను చవి చూశారు. కొత్త సర్కారు సమస్య పరిష్కరిస్తుందని నిరీక్షించారు. వారు అనుకున్నట్లుగానే సంతోషాన్ని కలిగిస్తూ బుధవారం వేతనాలతోపాటు ఎంప్లాయ్ ఐడీలు జారీ చేసే విధంగా రెవెన్యూ శాఖ సర్క్యులర్‌ను జారీ చేసింది. దీంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో 372 మంది వీఆర్ఏ కష్టాలు తొలిగాయి. హైదరాబాద్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా పూర్వ వీఆర్ఏ జేఏసీ తరఫున వీఆర్ఏలు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రెవెన్యూప్రిన్సిపల్ కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.


వేతనాలు లేక ఎన్నో ఇబ్బందులు

విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లుగా దశాబ్దాల కాలంగా సేవలు అందిస్తూ గత ప్రభుత్వంపై క్రమబద్ధీకరణ కోసం పోరాటాలు చేశారు. 80 రోజులపాటు సమ్మె చేశారు. వివిధ రూపాల్లో ఆందోళనలు చేయడంతో ప్రభుత్వం సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించి ఇతర శాఖల్లో వీఆర్ఏలను సర్ధుబాటు చేసింది. కానీ గత ప్రభుత్వం జాబ్‌చార్ట్‌లను ఉద్యోగ గుర్తింపు కార్డులు జారీ చేయలేదు.

చివరకు ఐదు నెలులగా వేతనాలు కూడా అందని పరిస్థితుల్లో ఇబ్బందుల పడ్డారు. జిల్లాలో వీఆర్ఏల్లో 474 మందిలో 372 మంది విద్యార్హతలను బట్టి వివిధ శాఖల్లో నియమించారు. ఇదే సమయంలో 60 ఏళ్లు పైబడిన వీఆర్ఏల్లో దాదాపు వంద మంది వరకు ఉన్నారు. వారి వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించినా ఇంత వరకు అమల్లోకి రాలేదు. తమ సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారో అనేదానిపై నిరీక్షిస్తూనే ఉన్నారు. సర్దు బాటు వీఆర్ఏలకు గతంలో తహసీల్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సమయంలో రూ.10, 500 చొప్పున వేతనాలు వస్తుండేవి. ప్రస్తుతం విద్యార్హతలను బట్టి మూడు కేటగిరీల్లో విభజించి సర్ధుబాటు చేశారు. ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్‌లకు రూ. 24,280, రికార్డు అసిస్టెంట్‌లకు రూ.22,150, సబార్డినేట్‌లకు రూ.18 వేల వరకు వేతనాలు చెల్లించే విధంగా స్కేల్ పోస్టుల్లో నియమించారు.

జీతాలు, ఐడీల సర్క్యులర్‌లపై హర్షం

వీఆర్ఏలకు ఎంప్లాయ్ గుర్తింపు కార్డులు, వేతనాలు చెల్లించడంపై సర్క్యులర్ జారీ చేసిన విషయమై రాజన్న సిరిసిల్ల జిల్లా పూర్వ వీఆర్ఏల జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. బుధవారం జేఏసీ జిల్లా కార్యదర్శి మల్లారం అర్జున్, విజయ్, సంకీర్తన, రమేష్‌తో పాటు పలువురు రెవెన్యూ మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డితోపాటు రెండు సంవత్సరాల కాలం నుంచి అనేక పర్యాయాలుగా పోరాటాలకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



GOVERNMENT OF TELANGANA
REVENUE (SER.II) DEPARTMENT

Memo.No.20680/Ser.II/A2/2023, dated 03.01.2024

Sub:- Revenue Department - Village Revenue Assistants - Absorption of VRAs in various Government Departments against Last Grade Services / Record Assistants / Jr.Assts. of equivalent categories - Instructions - Issued.

Ref:- From the Chief Commissioner of Land Administration, Telangana, Hyderabad, Lr. No. Ser.I(1)/2193251/23, dt. 11.12.2023.

In the circumstances as reported in the reference cited, Government hereby accord permission to the Chief Commissioner of Land Administration, Telangana, Hyderabad and all the District Collectors in the State to claim the salaries to (15,560) V.R.As. who were converted and absorbed in Government Departments as per G.O.Ms.No.81, Rev. (Ser.II) Dept. Dt. 24.07.2023 against the categories of Last Grade Services / Record Assistants / Jr.Assts. of equivalent categories as per their qualifications and to extend the regular pay scales, provided the absorption was made against the vacancies in regular sanctioned posts including the supernumerary posts created in G.O.Ms. No. 65, Finance (HRM-I) Department, dated 03-08-2023. They are also permitted to pay the honorarium to the V.R.As. who are still working in Revenue Department.

2. The Chief Commissioner of Land Administration, Telangana, Hyderabad and all the District Collectors in the State are requested to take necessary action in the matter, accordingly.

3. This order issues with the concurrence of the Finance (HRM.VII) Dept., vide their U.O.No. 2314904/1071/A2/HRM.VII/2023, dated 02.01.2024.

NAVIN MITTAL
PRINCIPAL SECRETARY TO GOVERNMENT

To
The Chief Commissioner of Land Administration, Telangana, Hyderabad
All the District Collectors in the State
SF/SC.

// FORWARDED :: BY ORDER //
SECTION OFFICER

ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్

సీఎంఆర్ ప్రక్రియను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) పెండింగ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా బాయిల్డ్, రా రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021-22 ఖరీఫ్ యాసంగికి సంబంధించిన సీఎంఆర్‌తోపాటు డీఫాల్ట్ వారు బియ్యం తొందరగా అందజేయాలన్నారు. 2022 -2023 సంబంధించి సీఎంఆర్ గడువు ఈ నెల 31వ తేదీ వరకు పొడగించినట్లు చెప్పారు. ఎఫ్‌సీఐకు ఇవ్వాల్సిన బియ్యం అందించాలన్నారు. 2023 -24 వానాకాలం సీజన్‌కు సంబంధించిన ఎఫ్‌సీఐ బియ్యం కూడా అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, జిల్లా మేనేజర్ జితేంద్ర ప్రసాద్, బాయిల్డ్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు చేపూరి నాగరాజు, రామిల్లర్ల సంఘం అధ్యక్షుడు పబ్బ నాగరాజు, రైస్‌మిల్లర్ల యజమానులు పాల్గొన్నారు.

ఆర్వీఎం క్లాత్ ఉత్పత్తిపై సమీక్ష

- సిరిసిల్లకు కోటి మీటర్ల ఆర్డర్లు



సమావేశంలో మాట్లాడుతున్న హిమజ్‌కుమార్

సిరిసిల్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు ఈ సంవత్సరం కూడా పాఠశాలల పిల్లలకు అందించే యూనిఫాం క్లాత్‌కు సంబంధించిన ఉత్పత్తిపై చేనేత జౌళి శాఖ అధికారులు బుధవారం సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కులో పారిశ్రామికులు, సైజింగ్ యజమానులతో సమీక్షించారు. ఈ సారి టెస్కో ద్వారా అందించే ఆర్వీఎం బట్ట ఆర్డర్లలో మార్పులు తీసుకొచ్చారు. గతంలో షర్టింగ్ క్లాత్‌ను తయారు చేసి ప్రింటింగ్‌కు పంపించేవారు. ఈసారి టెక్స్‌టైల్ పార్కులో నేరుగా డిజైన్‌తోనే ఉత్పత్తి చేయనున్నారు. 50 శాతం కాటన్‌దారం వాడనున్నారు. షర్టింగ్, షూటింగ్‌కు సంబంధించి కోటి మీటర్ల వరకు ఆర్డర్లు రానున్నాయి. ఇందుకు సంబంధించిన విధి విధానాలపై టెస్కో టెక్నికల్ అడ్మినిస్ట్రేటర్ ఓఎస్‌డీ హిమజ్‌కుమార్ పలు సూచనలు చేశారు. సమావేశంలో డీడీ అశోక్‌కుమార్, ఏడీ సాగర్, టెక్స్‌టైల్ పార్కు అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో విజిబుల్ పోలీసింగ్ కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జనవరి 3: శాంతిభద్రతల పరిరక్షణలో విజిబుల్ పోలీసింగ్ కీలకమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా విలేజ్ పోలీస్ అధికారులు, పెట్రోకార్, బ్లూ కోల్ట్ సిబ్బంది గ్రామాల్లో పర్యటించాలన్నారు. ప్రజల్లో భద్రత భావాన్ని పెంపొందించాలన్నారు. అభయ యాప్, బస్‌లో భరోసా, ఆపరేషన్ జ్వాల వంటి కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జిల్లాలో కొత్తగా వచ్చిన ప్యాసింజర్ వాహనాలను గుర్తించాలన్నారు. ఆర్టీసీ బస్‌లలో సీసీ కెమెరాలతో పాటుగా షీటీమ్ నెంబర్‌తో ఉన్న పోస్టర్ ఉండేలా చూడాలన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాలను నిర్మూలణే లక్ష్యంగా ప్రతీ ఒక్క అధికారి పని చేయాలని, గంజాయి రహిత జిల్లాగా మార్చాలని అన్నారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ప్రత్యేక కార్యచరణ రూపొందించాలన్నారు. విద్యార్థుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ క్లబ్స్ అమలు అయ్యేలా చూడాలన్నారు. మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, రవికుమార్, సీఐలు ఉపేందర్, సదన్‌కుమార్, కరుణాకర్, కృష్ణకుమార్, కిరణ్, ఎస్సైలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ప్రజాపాలనలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, జనవరి 3: అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బుదవారం సర్పంచ్ తర్రె ప్రభలత ఆధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడారు. ఎమ్మెల్యే హోదాలో అధికారిక కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాని, ఈ స్థాయిలో నిలిపిన ఊరు ప్రజలందరికీ ధన్యవాదాలని అన్నారు. 14 సంవత్సరాలు అనేక అంశాలపైన ప్రశించే గొంతుకయ్యాయని, పోరాటాలు చేశానని తెలిపారు. ప్రతీ సమస్య తనకు తెలుసని, వాటిని పరిష్కరిస్తానని అన్నారు. రుద్రంగి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంగం స్వరూపరాణి మహేష్, జడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎంపీటీసీ మంచె లావణ్య రాజేశం, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు గండి నారాయణ, ఎర్రం గంగనర్సయ్య, చెలుకల తిరుపతి, పల్లి గంగాధర్, గంగమల్లయ్య, తర్రె లింగం, ఇప్ప మహేష్, సిరికొండ రవి, మాడిశెట్టి అభిలాష్, గందం మనోజ్, స్వర్గం పరంధాములు, సూర యాదయ్య, చేప్యాల గణేష్, అట్టపల్లి మల్లేశం, పోగుల మహేష్, ఎర్రం అరవింద్, దాసు తదితరులు పాల్గొన్నారు.

మొట్టమొదటి సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే



నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, జనవరి 3 : సావిత్రీబాయి పూలే దేశంలో మొట్టమొదటి సంఘ సంస్కర్త, రచయిత అని, మహిళలకు విద్యను అందించేందుకు ఆమె చేసిన కృషి వెలకట్టలేనిదని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సావిత్రీ బాయి పూలే జయంతిని వేములవాడ పట్టణంలోని 19 వార్డులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి ఆది శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని అని, పీడిత ప్రజల, స్త్రీల విద్యాభివృద్ధికి ఆమె చేసిన కృషి అమోఘం అని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలల్లోనూ సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ కుమ్మరి శిరీష, 14 వార్డు కౌన్సిలర్ బింగి మహేష్, నాయకులు పాల్గొన్నారు.

లక్ష దాటిన అభయ హస్తం దరఖాస్తులు

- ఐదో రోజు 28,526

సిరిసిల్ల జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన కార్యాక్రమంలో బుధవారం ఐదో రోజు జిల్లాలో అభయ హస్తం ఆరు గ్యారెంటీల కింద 28, 526 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు అభయ హస్తం పథకాలకు లక్ష 11 వేల 985 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇతర దరఖాస్తులు 12 వేల 779 వచ్చాయి. బుధవారం 39 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపల్ వార్డుల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. గురువారం 28 గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బోయినపల్లి మండలంలో వర్ధవెల్లి, వెంకట్రావుపల్లి, విలాసాగర్, చందుర్తి మండలంలో మర్రిగడ్డ, ఇల్లంతకుంట మండలంలో చిక్కుడివానిపల్లె, రామోజీపేట, సిరికొండ, తెనుగువాణిపల్లె, వెంకట్రావుపల్లి, గంభీరావుపేట మండలంలో గంభీరావుపేట, కోనరావుపేట మండలంలో కొండాపూరం, వెంకట్రావుపేట, ఎగ్లాస్‌పూర్, కోనరావుపేట, ముస్తాబాద్ మండలంలో ముస్తాబాద్, పోత్గల్, రుద్రంగి మండలంలో సర్పంచ్ తండా, తంగళ్లపల్లి మండలంలో ఓబులాపూర్, పద్మనగర్, పాపయ్యపల్లి, రాళ్లపేట, వేములవాడ అర్బన్ మండలంలో చీర్లవంచ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, వేములవాడ రూరల్ మండలంలో మల్లారం, మర్రిపల్లి, జయవరం, ఎల్లారెడ్డిపేట మండలంలో గుండారం, ఎల్లారెడ్డిపేట, రాగట్లపల్లిలో నిర్వహిం చనున్నారు.

నేడు ప్రభుత్వ విప్ పర్యటన

ఎల్లారెడ్డిపేట, జనవరి 3: ఎల్లారెడ్డిపేట మండలంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి గురువారం పర్యటించనున్నారని ఆ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు నర్సయ్య ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించనున్న అభయ హస్తం ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

మహిళలను చైతన్య పరిచిన సావిత్రీబాయి పూలే



నివాళి అర్పిస్తున్న కవులు, రచయితలు

సిరిసిల్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సావిత్రీ బాయి పూలే మహిళలను అక్షర బోధనవైపు నడిపిస్తూ చైతన్య పరిచారని అఖిలబారత తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు జూకంటి జగన్నాథం అన్నారు. బుధవారం సిరిసిల్ల గాంధీ చౌక్ వద్ద తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ సావిత్రీ బాయి పూలే భారత మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయినని, ఆమె భర్త జ్యోతిబాపూలే ప్రోత్సాహంతో చదువుకు శ్రీకారం చుట్టడమే కాకుండా ఎంతో మంది మహిళలకు చదువును అందించి ముందుకు నడిపించారని అన్నారు. సమాజంలో ఉన్న అసమానతలను రూపుమాపడానికి ప్రయత్నం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఆడెపు లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు వెంగళ నాగరాజు, కవులు, రచయితలు చిటికెన కిరణ్, బూర దేవానందం, అంజనేయులు, వెంగళ లక్ష్మణ్ పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

ఇల్లంతకుంట, జనవరి 3: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ బుధవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమించిన ధీశాలి ఐలమ్మ అమ్మ అని కొనియాడారు. ఆమె ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని కోరారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

తంగళ్లపల్లి, జనవరి 3: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం మయూర గిరి పీఠాధితి జ్యోతిష్య వాస్తు ఆగమ శాస్త్ర పండితుడు నమిలికొండ రమణాచార్యస్వామి ఆధ్వర్యంలో స్వామివారి నూతన విగ్రహాల ఊరేగింపు చేపట్టారు. మహోత్సవంలో భాగంగా గురువారం నుంచి శనివారం వరకు గోపూజ, శాల ప్రవేశం, మూలమూర్తులకు నిత్య హోమాలు, నిత్య పూర్ణాహుతి, విష్ణు సహస్రనామ పారాయణం, విగ్రహ ప్రతిష్ఠాపన, లక్ష్మీనరసింహస్వామి కల్యాణం వంటి కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

బీర్‌పూర్ ఘాట్‌రోడ్డుపై ఇరుక్కుపోయిన బస్సులు



ఘాట్‌రోడ్డుపై నిలిచిపోయిన బస్సులు

బీర్‌పూర్,జనవరి 3: బీర్‌పూర్ ఘాటు రోడ్డుపై రెండు బస్సులు బుధవారం ఇరుక్కుపోయాయి. జగిత్యాల నుంచి బీర్‌పూర్ వైపు ఓ ప్రైవేట్ బస్ వెళుతుండగా కడెం నుంచి జగిత్యాలకు వెళ్లే పల్లెవెలుగు బస్సు ఎదురుగా వచ్చింది. ఆ ప్రాంతంలో రోడ్డు ఇరుకుగా ఉంది. సీసీ రోడ్డుకు ఇరు పక్కలా బస్సులు దింపుకునేందుకు స్థలం లేక పోవడంతో ఏ బస్సు ఎటు వైపు వెళ్లాలి అనేది అర్థం కాక అర గంట పాటుగా డ్రైవర్లు నానా తంటాలు పడ్డారు. ప్రైవేట్ బస్సు గుట్ట దిగుతుండడం, ఆర్టీసీ బస్సు గుట్ట ఎక్కుతుండగా నిలిచిపోయాయి. ఏ మాత్రం తేడా వచ్చినా బస్సులు లోయలో పడే ప్రమాదం ఉంది. అరగంటపాటు ప్రయత్నించిన తర్వాత బస్సులు వెళ్లాయి. తమ ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని ఉన్నామని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి రోడ్డు వెడెల్పు చేయాలని కోరారు.

టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించాలి



సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

మెట్‌పల్లి, జనవరి 3: టెట్‌తో సంబంధం లేకుండా పదోతన్నతులు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవోకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక కన్వీనర్ తులసి ఆగమయ్య, కోకన్వీనర్లు అంకతి లింగారెడ్డి, జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు శ్యామ్‌సుందర్, నాయకులు లావుడ్య రాజు, జరుపుల సుధాకర్, వహీద్, విజయభాస్కర్, పులి రమేష్, రవిబాబు, సరిత, ప్రమీల పాల్గొన్నారు.

కోరుట్లలో నమ్మాళ్‌వార్ పరమపదోత్సవం



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

కోరుట్ల, జనవరి 3: పట్టణంలోని పురాతన వేంకటేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నమ్మాళ్‌వార్ పరమ పదోత్సవాన్ని బుధ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుడు బీర్నంది నర్సింహా చారి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అర్చన అభిషేకాలను నిర్వహించారు. మనిషి మరణించిన తరువాత జరిగే విషయాలను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విక్రం, సిబ్బంది నర్సయ్యతోపాటు అర్చకులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానా సేవలను వినియోగించుకోవాలి



పల్లె దవాఖానాను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

రాయికల్, జనవరి 3: పల్లె దవాఖానాలో సేవలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పి శ్రీధర్ అన్నారు. మండలంలోని కట్కాపూర్ పల్లె దవాఖానాను కేంద్ర నాణ్యత ప్రమాణాల బృందం సభ్యులు ఎస్ శ్రీలక్ష్మి, ప్రేమాన్సు బుధవారం సందర్శించారు. పల్లె దవాఖానాలో అందించే ఆరోగ్య సేవలను పరిశీలించారు. కిశోర బాలికలకు అందించే సేవలు, కుటుంబ నియంత్రణ, పుట్టిన పిల్లలకు అందించే సేవలు, అంటు వ్యాధుల నియంత్రణ, సాధారణ వ్యాధుల నియంత్రణ, సాధారణ వ్యాధుల నియంత్రణ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉప వైద్యాధికారి శ్రీనివాస్, సర్పంచ్ రాజమౌళి, మెడికల్ ఆఫీసర్ కస్తూరి సతీష్, అంజిత్ రెడ్డి, డీపీవో స్వామి, నేషనల్ క్వాలిటీ మేనేజర్ నాగరాజు, హెచ్ఈవో శ్రీనివాస్, సూపర్‌వైజర్ శ్రీధర్, సీహెచ్‌వో ప్రమీళ, ఎంఎల్‌హెచ్‌పి శ్రీధర్, రాహుల్, ఝాన్సీ, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, లలిత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎల్లారెడ్డిపేట, జనవరి 3: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామ శివారులో పట్టుకున్నామని ఎస్ఐ రమాకాంత్ బుధవారం తెలిపారు. అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నారనే సమాచారంతో స్టేషన్ హౌస్ అధికారులు రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ హరిదాస్‌నగర్ గ్రామ శివారులోని వాహన తనిఖీలు నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసునకు తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను వారు పట్టుకున్నారని తెలిపారు .ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి వాహన డ్రైవర్లు గడ్డం భార్గవ్, పులి కిషన్, కూడలి అశోక్‌తో పాటు యజమానులపై కేసు నమోదు చేశామని చెప్పారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రమాకాంత్ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెగడపల్లి, జనవరి 3: మండలంలోని బతికెపల్లి గ్రామానికి చెందిన క్యాస సంజీవ్ (37) అనే వ్యక్తి మంగళవారం రాత్రి గ్రామశివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సంజీవ్ గ్రామం నుంచి జగిత్యాల వెళ్తుండగా బతికెపల్లి శివారులో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. దీంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బావమరిది మల్లయ్య ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్ సతీష్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, జనవరి 3: చదువుకొమ్మని తల్లిదండ్రులు మందలించారని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలంలోని గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన పాపినేని శివమణి(19) ఇంటర్ చదువుతున్నాడు. మంచిగా చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో శివమణి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ మహేందర్ తెలిపారు.

బొట్లవనపర్తిలో ఒకరి హత్య

ధర్మారం, జనవరి 3: మండలంలోని బొట్లవనపర్తి గ్రామానికి చెందిన వాలుక మల్లేష్(45)అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. పెద్దపల్లి సీఐ అనిల్ కుమార్ కథనం ప్రకారం.. బొట్లవనపర్తి గ్రామానికి చెందిన వాలుక మల్లేష్ మంగళవారం తెల్లవారుజాము 2గంటల సమయంలో బయటకు వెళ్లాడు. అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించారు. బుధవారం ఉదయం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో మల్లేష్ మృతదేహం పడి ఉంది. మృతదేహాన్ని బయటకు తీసి చూడగా అతని గొంతు, కడుపు భాగంలో పదునైన ఆయుధంతో కోసి చంపినట్టుగా ఉంది. మృతునికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. మల్లేష్ ప్రతి రోజు పెద్దపల్లిలో భవన నిర్మాణ పనికి వెళ్తుంటాడు. తన భర్తను అదే గ్రామానికి చెందిన అకారి అంజయ్య హత్య చేసినట్టు అనుమానంగా ఉందని భార్య రజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. సంఘటన స్థలాన్ని సీఐ పరిశీలించారు. ఆయన వెంట ధర్మారం ఎస్సై సత్యనారాయణ ఉన్నారు.

హాస్టల్ విద్యార్థులపై దాడి : నిందితుల రిమాండ్

కరీంనగర్ క్రైం, జనవరి 3: కరీంనగర్‌లోని రాంనగర్ ఎస్సీ హాస్టల్ విద్యార్థులను కర్రలు, రాళ్లతో కొట్టిన నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని రెండో టౌన్ పోలీసులు తెలిపారు. డిసెంబరు 31న రాంనగర్ హాస్టల్ వద్ద జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకుని మంగళవారం రాత్రి 11:30 గంటలకు రాంనగర్‌కు చెందిన సాయిరాం, నాగరాజు, అరుణ్, సిద్ధార్థ, మధు, రవిప్రసాద్, శ్రీధర్, ఈశ్వర్, పవన్‌లు రాంనగర్ ఎస్సీ హాస్టల్‌లోకి అక్రమంగా ప్రవేశించి విద్యార్థులు వేల్పుల మధు, మరికొంత మంది విద్యార్థులను కర్రలు, రాళ్లతో కొట్టారు. ఇదే సమయంలో వాచ్‌మన్ అడ్డురాగా అతడి తలపై కర్రలతో కొట్టారు. ఈ మేరకు బాధితుడు వేల్పుల మధు ఫిర్యాదుతో 9 మంది నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

ఇడ్లీ బండిని ఢీకొట్టిన లారీ

● పలువురికి స్వల్ప గాయాలు ● తప్పిన ప్రమాదం


ఇడ్లీ బండికి ఢీకొట్టి బోల్తాపడిన లారీ

సిరిసిల్ల క్రైం, జనవరి 3: సిరిసిల్ల-కరీంనగర్ ప్రధాన రహదారిలో రగుడు ఎల్లమ్మ ఆలయం వద్ద బుధవారం ఉదయం అతివేగంగా వచ్చిన ఓ లారీ అదుపుతప్పి ఇడ్లీ బండిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇడ్లీ బండి ఎగిరిపడడంతో సామగ్రి చెల్లాచెదురైంది. అప్పటికే ప్రమాదాన్ని గుర్తించిన చిరువ్యాపారితో సహా అక్కడ టిఫిన్ చేస్తున్న వారంతా పరుగెత్తారు. అయినప్పటికీ పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఇడ్లీ బండికి ఢీకొట్టిన లారీ రోడ్డుపై పల్టీలు కొట్టింది. లారీ నుజ్జునుజ్జయ్యింది. గాయాలపాలైన క్షతగాత్రులను చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

7న ఉమ్మడి జిల్లా సీనియర్ ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 3: జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి సీనియర్ మహిళలు, పురుషుల ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 7న నిర్వహించనున్నారు. కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 10 గంటల నుంచి ఈ ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నటరాజ్ రవి, వై మహేందర్‌రావులు తెలిపారు. ప్రతిభచాటే క్రీడాకారులను ఈనెల చివరి వారంలో నల్గొండ జిల్లా భువనగిరిలో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ ఖో-ఖో పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్లకు ఎంపిక చేయనున్నామని వారు పేర్కొన్నారు. కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల క్రీడాకారులు పోటీల్లో పాల్గొనుటకు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ స్టేడియంలో రిపోర్టు చేయాలని వారు సూచించారు.

అయోధ్య రామాలయం పేరిట డబ్బుల వసూళ్లు

● పోలీసులకు అప్పగించిన స్థానికులు
● రామాలయం పేరు చెపితే డబ్బులు ఇవ్వకండి : పోలీసులు

హుజూరాబాద్, జనవరి 3: హుజూరాబాద్ పట్టణంలోని సూపర్‌బజార్ రోడ్‌లో కొందరు అర్చకులుగా చెప్పి అయోధ్య రామాలయం పేరిట ఇంటింటికీ తిరుగుతూ డబ్బులు వసూలు చేస్తుండగా స్థానికులు బుధవారం అడ్డుకున్నారు. ఈ విషయాన్ని స్థానికులు బీజేపీ నాయకుల దృష్టికి తీసుకెళ్లగా, హుటాహుటిన వారి వద్దకు బీజేపీ పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు వచ్చి వారిని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఐదుగురు అర్చకులుగా చెప్పుకుంటున్నారని గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి అదుపులోకి తీసుకున్నారు. రామాలయం పేరు మీద డబ్బులు వసూళ్లు చేయవద్దని హెచ్చరించారు. ఈ సందర్భంగా గంగిశెట్టి రాజు మాట్లాడుతూ అయోధ్య రామాలయం పేరు మీద ఎవరైనా డబ్బులు అడిగితే రూపాయి కూడా ఇవ్వవద్దన్నారు.

రజనీశ్రీ రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారానికి నవలల ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, జనవరి 3: జాతీయ సాహిత్య పరిషత్ ద్వారా అందించే నటుడు, కవి, నాటక రచయిత, నాట్యాచార్యుడు రజనీశ్రీ రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారానికి నవలలను ఆహ్వానిస్తున్నట్లు పురస్కార కమిటీ కన్వీనర్, పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు గాజుల రవీందర్, నంది శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారం కింద ప్రశంసాపత్రం, 10,116 రూపాయల నగదు అందిస్తామని పేర్కొన్నారు. సొంతగా రచించిన నవలలు మాత్రమే పంపాలని, అనువాద నవలలు పోటీకి స్వీకరించబడవని తెలిపారు. జనవరి 1, 2014 నుంచి డిసెంబరు 31, 2023 లోపు ముద్రించిన నవలలను ప్రతీ టైటిల్స్ నాలుగు ప్రతులను పంపాలని కోరారు. ఫిబ్రవరి 10వ తేదీ లోపు గాజుల రవీందర్, ఇంటి నెంబరు 8-3-255/1, రామచంద్రాపూర్‌కాలని, రోడ్ నెం. 12, భగత్‌నగర్, కరీంనగర్-505001 చిరునామాకు నవలలను పంపాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9848255525 లేదా 9490401861 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

మల్లన్న జాతరకు పోటెత్తిన భక్తజనం

● స్వామివారికి బోనాలు సమర్పించిన భక్తులు


ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

గొల్లపల్లి, జనవరి 3: గొల్లపల్లి మండలం మల్లన్నపేటలో జరుగుతున్న మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు భక్తుల కొంగు బంగారంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులతో బుధవారం జాతర పోటెత్తింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బెల్లం పానకంతో వండిన బోనాలను భక్తులు నెత్తిన ఎత్తుకుని ఒగ్గు పూజారుల ఢమరుక నాదాల నడుమ ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేశారు. శివసత్తుల పూనకాలు, భక్తుల మల్లన్న నామస్మరణలతో ఆలయ పరిసర ప్రదేశాలు మార్మోగాయి. మల్లన్న స్వామికి బోనాలు సమర్పించి తమ ఇష్టదైవానికి ప్రీతిపాత్రమైన పసుపు బెల్లం, బంతి పూలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గర్భగుడి ఎదుట భక్తులు క్యూలైన్‌లో బారులు తీరి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొందరు భక్తులు తమ పిల్లలకు పుట్టు వెంట్రుకలు తీయించగా, మరికొందరు భక్తులు మల్లన్న స్వామికి ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో పట్నాలు వేయించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తమ కుల దైవానికి నిలువెత్తు నల్ల బంగారం (బెల్లం) తులాభారం వేయించి భక్తులకు పంచిపెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధంకి నర్సయ్య, ఉప సర్పంచ్ బేర కిశోర్, ఎంపీటీసీ గోస్కుల రాజన్న, సిద్ధంకి మల్లయ్య పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

కోల్‌సిటీ, జనవరి 3: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరికి బుధవారం గోదావరిఖని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు రెండవ అదనపు న్యాయమూర్తి దుర్గం వెంకటేష్ ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్టు రామగుండం ట్రాఫిక్ సీఐ టీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరు మద్యం సేవించి పట్టుబడ్డారని, వారిని కోర్టులో ప్రవేశపెట్టగా ఐదు రోజుల జైలుశిక్ష విధించారని చెప్పారు.

రూ.6,750 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జనవరి 3: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,750 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 76మంది రైతులు 682 క్వింటాళ్ల విడిపత్తి, నలుగురు రైతులు 13క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు.

ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.6750, కనిష్ఠ ధర రూ.5,400 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

పురుగు మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి

కాల్వశ్రీరాంపూర్, జనవరి 3: అనారోగ్యంతో బాధపడుతూ పురుగుల మందు తాగిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన కన్నూరి రామకృష్ణ(22) గత కొన్ని రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో రామకృష్ణ జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో పురుగుల మందు తాగాడు.

గమనించిన కుటుంబ సభ్యులు రామకృష్ణను కరీంనగర్‌కు తరలించగా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. రామకృష్ణ తల్లిదండ్రులు విజయ్, లలితల ఏకైక కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో వారి రోదనలు మిన్నంటాయి. రామకృష్ణ తండ్రి విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

వైన్స్‌షాప్‌లో చోరీ కేసులో నిందితుల పట్టివేత

● ఆటో, రూ.98వేలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై

రామగిరి, జనవరి 3: మండలంలోని లద్నాపూర్ గ్రామంలోని మహాలక్ష్మి వైన్స్ షాప్‌లో చోరీకి పాల్పడిన నిందితులను పోలీసులు బుధువారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు బుధవారం రామగిరి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సతీష్ ఆధ్వర్యంలో ఎస్ఐ రవీప్రసాద్ వివరాలను వెల్లడించారు. మండలంలోని లద్నాపూర్ వద్ద గల వైన్స్ షాప్‌లో మంగళవారం రాత్రి పెద్దపల్లికి చెందిన వ్యాపారి సయ్యద్ షఫీ ఉద్దీన్, మరో బాలుడు అర్థరాత్రి షటర్ తాళం పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. క్యాష్ కౌంటర్‌లో గల రూ.98 వేలు ఎత్తుకెళ్లారు. బుధవారం వైన్స్ యాజమాని ఫిర్యాదు మేరకు నిందితుల కోసం ప్రత్యేక టీంలు గాలింపు చేపట్టారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించి నిందితులు ఉపయోగించిన ఆటో గుర్తించారు. సదరు నిందితులు తిరిగి మంథని వైపు వెళ్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు పన్నూరు క్రాస్‌రోడ్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా ఉన్న నిందితులను పట్టుకొని విచారించడంతో నేరం అంగీకరించినట్లు ఎస్ఐ తెలిపారు. వారి వద్ద రూ.98 వేల నగదుతోపాటు ఆటోను స్వాధీనం చేసుకుని వారిద్దరినీ రిమాండ్ తరలించినట్లు పేర్కొన్నారు. చోరీ కేసును చేధించిన ఎస్ఐ రవీప్రసాద్, పోలీసులను మంథని సీఐ సతీష్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో పీఈటీ

మానకొండూర్, జనవరి 3 : మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో గల కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఎనిమిదో తరగతి చదువుతున్న రమాదేవి అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూర్ క్రీడా ప్రాంగణంలో బుధవారం జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీలు జరిగాయి. నాలుగు జిల్లాల నుంచి పలువురు క్రీడాకారులు హాజరు కాగా ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనభ కనబరిచిన రమాదేవి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 6,7,8 తేదీలలో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలల్లో పాల్గొననుంది. రమాదేవి ఎంపిక పట్ల పాఠశాల ప్రత్యేక అధికారి స్వప్న, వ్యాయామ ఉపాధ్యాయురాలు కోమలత, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

వెల్గటూర్‌లో...

వెల్గటూర్: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్ బాల్ పోటీలకు చెగ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ అశోక్ తెలిపారు. గుల్లకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 17 బాల, బాలికల విభాగంలో చెగ్యాం పాఠశాల విద్యార్థులు రాంచరణ్, వైష్ణవి, రిషిత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. కాగా విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, ఎస్ఎంసీ చైర్మన్ రాజయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

రాజన్న సేవలో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

వేములవాడ, జనవరి 3: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించారు. ఆలయ ప్రొటోకాల్ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు స్వామి వారి ప్రసాదం అందజేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాజన్న ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. వేములవాడ రాజన్నను దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.



ఎమ్మెల్సీకి ప్రసాదం అందజేస్తున్న సూపరింటెండెంట్ శ్రీరాములు

ఎస్‌యూ డిగ్రీ పరీక్షల్లో 1,931 మంది గైర్హాజరు

గణేశ్‌నగర్, జనవరి 3: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం 1,931 మంది గైర్హాజరైనట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. మొదటి సెమిస్టర్ పరీక్షలకు 13,526 మంది విద్యార్థులు హాజరు కాగా 1397 మంది గైర్హాజరయ్యారన్నారు. మూడో సెమిస్టర్ పరీక్షలకు 12,803 మంది హాజరు కాగా 534 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గంగాధర, జనవరి 3: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పుల్ల అభిలాష్ తెలిపారు. నాగిరెడ్డిపూర్ వాగునుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రాత్రికి రాత్రే ఆలయానికి అడ్డుగా గోడ నిర్మాణం

● పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు


మెట్‌పల్లిలోని త్రిశక్తి ఆలయానికి అడ్డుగా నిర్మించిన గోడ

మెట్‌పల్లి, జనవరి 3: పట్టణంలోని త్రిశక్తి ఆలయం ముఖద్వారానికి అడ్డుగా గుర్తు తెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే గోడ నిర్మాణం చేశారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ సమీపంలోని త్రిశక్తి ఆలయం తూర్పు దిక్కున ఉన్న గేటుకు అడ్డుగా గుర్తు తెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే అక్రమంగా గోడ నిర్మాణం చేపట్టారని నిర్వాహకులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై చిరంజీవి సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆలయంలోని అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులు లోపలికి పోవడానికి ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన గోడను కొంత మేరకు తొలగించారు. ఈ సందర్భంగా ఆలయం చైర్మన్ ద్యావనపల్లి రాజారామ్ మాట్లాడుతూ త్రిశక్తి ఆలయం ముందున్న ఖాళీ స్థలం అన్ని దేవాలయాలకు సంబంధించిందని, ఉదయం ఆలయానికి వచ్చి చూసేసరికి తూర్పు దిక్కున ముఖద్వారానికి అడ్డుగా గోడ నిర్మించి ఉందన్నారు. దీంతో వెంటనే స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్, పోలీసులకు సమాచారం అందించామన్నారు. ఎస్సై సంఘటన స్థలం పరిశీలించి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్మించిన గోడను తొలగించారు. అక్రమంగా గోడ నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు ఆలయం చైర్మన్ తెలిపారు.

ఆవును వధించిన నిందితుల రిమాండ్

● వివరాలు వెల్లడించిన ఏసీపీ జీవన్‌రెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

శంకరపట్నం, జనవరి 3: శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన గాజుల పద్మ ఆవును పశువుల కొట్టంలో నుంచి తీసుకెళ్లి వధించిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ జీవన్‌రెడ్డి విలేకరులకు వివరాలు వెల్లడించారు. మొలంగూర్‌కు చెందిన గాజుల పద్మ ఈ నెల 1న సాయంత్రం ఆవును పశువుల కొట్టంలో కట్టేసి తెల్లవారు జామున చూడగా ఆవు కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం సాయంత్రం ఎండీ ఇజాజ్ బేగ్ అలియాస్ సద్దాం, షేక్ తాజ్, మోరె మనోజ్ అనే ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి విచారించారు. ఈ ముగ్గురు వ్యక్తులు గాజుల పద్మ ఆవును దొంగలించి కోసి మాంసం విక్రయించినట్లు తెలిపారు. మాంసం విక్రయించగా వచ్చిన డబ్బులు రూ.5వేలు, గోవును వధించడానికి వాడిన ఆయుధాలు, ఒక బైక్‌ను వారి వద్ద నుంచి రికవరీ చేసుకున్నట్లు పేర్కొన్నారు. ముగ్గురు నిందితులను మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. జ్యుడీషియల్ రిమాండ్ కోసం హుజూరాబాద్ సబ్‌జైలుకు తరలించారు. గోవధ చట్టరీత్యా నిషేధం ఎవరైనా గోహత్య చేసినా, ట్రాన్స్‌పోర్ట్ చేసినా వారికి సహకరించినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ జీవన్‌రెడ్డి అన్నారు. 12గంటల్లోపు కేసు చేధించి నిందితులను అరెస్టు చేసిన హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ లక్ష్మారెడ్డితో పాటు సిబ్బందిని ఏసీపీ జీవన్‌రెడ్డి అభినందించారు.

విద్యుత్ మోటార్ల దొంగలను పట్టుకున్న రైతులు


నిందితులను విచారిస్తున్న పోలీసులు

జగిత్యాల రూరల్, జనవరి 3: మండలంలోని పలు గ్రామాల్లో దొంగల ముఠా వరుసగా విద్యుత్ మోటార్లను చోరీ చేస్తూ రైతులకు కంటిమీద కునుకులేకుండా చేసింది. దీనిపై 20 రోజుల క్రితం జగిత్యాల రూరల్ స్టేషన్‌లో రైతులు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసినా దొంగల ఆచూకీ దొరకలేదు. దీంతో రైతులు అప్రమత్తమై దొంగలను కనిపెట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో బుధవారం జగిత్యాల మండలంలోని మోతె బైపాస్ నల్లగుట్ట శివారులో ఉదయం ఐదు గంటల సమయంలో ఓ రైతు పొలంలో విద్యుత్ మోటార్‌ను ఎత్తుకెళ్తుండగా రైతులు దొంగలను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్, లక్ష్మీపూర్, పొలాస, తిమ్మాపూర్ శివారుల్లో వరుసగా లక్షల విలువ చేసే మోటార్లు ఎత్తుకెళ్లడంతో పంటపొలాలు ఎండిపోయి, రైతులు ఆర్థికంగా నష్టపోయారు. దీంతో రైతులు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు దొంగల ఆచూకీని కనిపెట్టి పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్న జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్, ఎస్సై సదాకర్ ముగ్గురు విద్యుత్ మోటార్ల దొంగలను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

జగిత్యాల మండలంలోని మోతె బైపాస్ శివారులో ఓ రైతుకు చెందిన పొలంలో విద్యుత్ మోటార్‌ను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నిస్తున్న దొంగలను రైతులు పట్టుకొని జగిత్యాల రూరల్ పోలీసులకు అప్పగించారు. వీరిలో బోధన్ ప్రాంతానికి చెందిన ఒకరు, జగిత్యాల జిల్లా కేంద్రంలోని జంబిగద్దె ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

డిప్యూటీ సీఎంకు రాజన్న ప్రసాదం


ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

వేములవాడ, జనవరి 3: రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్కకు వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవ స్థానం అర్చకులు, అధికారులు స్వామివారి ప్రసాదాన్ని బుధవారం అంద జేశారు. నూతన సంవత్సరం సంద ర్భంగా హైదరాబాద్‌లో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు వేద పండితులు భట్టి విక్రమార్కను ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు. ఆలయ ఉద్యోగి ఎడ్ల శివ స్వామివారి శేష వస్త్రంతో సన్మానించారు.

సేవాలాల్ మహారాజ్ జయంతికి సెలవు ప్రకటించాలి


వినతి పత్రం అందజేస్తున్న గిరిజన నాయకులు

వేములవాడ, జనవరి 3 : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15వ తేదీని అధి కారిక సెలవు దినంగా ప్రక టించాలని లంబాడీల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు నరేష్ నాయక్ విజ్ఞప్తి చేశారు. బుధవారం వేముల వాడ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. తెలంగాణలో సుమారు 35 లక్షల జనాబా ఉన్న గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున ప్రభుత్వం అధికారికంగా సెలవుదినం ప్రకటించే విధంగా చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దర్సింగ్ నాయక్, రమేష్ నాయక్, మహేందర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్వర్‌కు టీఎన్జీవో జిల్లా నాయకుల శుభాకాంక్షలు


జగదీశ్వర్‌ను సన్మానిస్తున్న జిల్లా నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 3: అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మారం జగదీశ్వర్‌ను బుధవారం టీఎన్జీవో జిల్లా నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. టీఎన్జీవో తెలంగాణ అధ్యక్షుడిగా సేవలందిస్తున్న మారం జగదీశ్వర్ అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ సమాఖ్య ఉపాధ్యక్షుడిగా నియమకమవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఎలుసాని ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి గాజుల సుదర్శన్, ఉపాధ్యక్షుడు మెట్ట శ్రీకాంత్, కోశాధికారి రియాజ్‌పాషా, సభ్యులు పాల్గొన్నారు.

అర్థరహిత ఆరోపణలు మానుకోవాలి

ఎల్లారెడ్డిపేట, జనవరి 3: కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు అర్థరహిత ఆరోపణలు మానుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో మాజీ సీఎం కేసీఆర్‌తో కలిసి కేకే మహేందర్‌రెడ్డి పని చేశారనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. కేకేపై అనుచిత వ్యాఖ్యలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజల ఆగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, రాజేందర్, దేవయ్య, రాజునాయక్, భాస్కర్, రవి పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా లక్ష్మణ్

ఇల్లంతకుంట, జనవరి 3: మండలంలోని రేపాక మున్నూరు కాపు సంఘ అధ్యక్షుడిగా కొలుపుల లక్ష్మణ్ ఎన్నికయ్యారు. సంఘం భవనంలో బుధవారం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కొలుపుల సత్తయ్య, ప్రధానకార్యదర్శిగా కొలుపుల లక్ష్మణ్, కోశాధికారిగా పత్తెం రాజు, కార్యవర్గ సభ్యులుగా రవీందర్, సుధాకర్, రాజయ్య, గౌరవసభ్యులుగా పెద్ద రాజయ్య ప్రవీణ్, భూమయ్య, సోషల్‌మీడియా కన్వీనర్‌గా కొలుపుల సందీప్ ఎన్నికయ్యారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బోయినపల్లి జనవరి 3: బోయినపల్లి మండలంలోని జగ్గారావుపల్లి గ్రామంలో మృతి చెందిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ చల్ల శివ కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రామన్నపేట గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన అన్నాడు బాపురెడ్డి కుటుంబ సభ్యులు వేములవాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్ రెడ్డి లు పరామర్శించి సానుభూతిని వ్యక్తపరిచారు

కోనరావుపేట: కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పిట్టల రమేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి బీజేపీ జిల్లా నాయకుడు గోపాడి సురేందర్ రావుతోపాటు పలువురు బీజేపీ నాయకులు బుధవారం పరామర్శించారు. రూ.3వేలు 50 కిలోల బియ్యం అందజేశారు. బీజేపీ నాయకులు గొట్టె రామచంద్రం, బొల్లారం తిరుపతి, మిర్యాల్‌కార్ బాలాజీ, జవ్వాజి తిరుపతి గౌడ్, లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తిరుపతి మధు తండ్రి రాజయ్య మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు వంగపల్లి శ్రీనివాస్, మెరుగు లక్ష్మణ్ గౌడ్, కేతిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, విజయరెడ్డి, నోముల తిరుపతిరెడ్డి ఉన్నారు.

బియ్యం అందజేత

ఎల్లారెడ్డిపేట, జనవరి 3: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జోగి చంద్రయ్య కుటుంబానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు బుధవారం 50 కిలోల బియ్యం అందజేవారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు బాబు, లింగాగౌడ్, రాజ్‌కుమార్, గోపాల్, చంద్రం, లింగం, తిరుపతి, దేవరాజు, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి


ఉపాధ్యాయినిని సన్మానిస్తున్న అతిథులు

సిరిసిల్ల టౌన్, జనవరి 3: ఆడపిల్లలకు విద్యనందించాలని సావిత్రీ బాయి పూలే పాటుపడ్డారని జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణారాఘవరెడ్డి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని గ్రంథాలయం ఆవరణలో ఎస్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణారాఘవరెడ్డి, జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయినులను సన్మానించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్ పర్సన్ అరుణారాఘవరెడ్డి మాట్లాడుతూ సమాజంలో రుగ్మతలను రూపుమాపడానికి సావిత్రీబాయి పూలే అహర్నిషలు కృషి చేశారన్నారు. సామాజిక ఉద్యమకారిని సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యా రంగానికి పెద్ద పీట వేశారన్నారు. మన ఊరు మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలో సకల సౌకర్యాలను కల్పించారన్నారు. అనంతరం ఎస్‌టీయూటీఎస్ -2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్స్ శైలజా, పద్మజా, ఎస్‌టీయూటీఎస్ అధ్యక్షుడు లక్ష్మన్, కార్యదర్శి సదానందం పాల్గొన్నారు.

● బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని నేతన్న విగ్రహం వద్ద సావిత్రిబాయి పూలే చిత్రపటానికి విద్యార్థులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్, నాయకులు మట్టె శ్రీనివాస్, నవీన్, జగన్, వంశీ, పవన్, గణేష్, నరేష్, తిరుపతి, హరిప్రియ, శ్రీజ, రమ్య, అఖిల, సౌమ్య, రజనీ, సుష్మ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల, రహీంఖాన్‌పేట ఆదర్శ పాఠశాలలో బుధవారం సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహిళల చదువు కోసం సావిత్రిబాయి పూలే చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ శిరీష, శోభారాణి పాల్గొన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండలంలోని ఆదర్శ పాఠశాల, కస్తూర్బా పాఠశాలతోపాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్ కుమార్, ఎస్ఎంసీ చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం సావిత్రీ బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పాటిరాజం విగ్రహం వద్ద సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడడు దోసల చంద్రం, ప్రధాన కార్యదర్శి దోసల ఉపేంద్ర, నాయకులు నల్ల రాజ్‌కుమార్, రామచంద్రం, వికాస్, శంకర్, సతీష్, మైనిక, మంజుల, శ్రీలత, విజయ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కళాశాలలో..

గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కళాశాలలో సావిత్రీ బాయి పూలే జయంతిని నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటస్వామి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఆడపిల్లల చదువు కోసం నిరంతరం పరితపించిన మహిళా చైతన్య మూర్తి సావిత్రి బాయి పూలే అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిపేట మండలంలో సావిత్రీ బాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, దుమాల, బొప్పాపూర్, గుండారం, అల్మాస్‌పూర్, వెంకటాపూర్, బండలింగంపల్లి, తదితర గ్రామాల్లో ఎమ్మార్పీఎస్, ఎస్ఎఫ్ఐ, వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయా ప్రభుత్వ, ప్రైవేటు, ఆదర్శ, కేజీబీవీ పాఠశాలల్లో వేడుకలను నిర్వహించారు. గొల్లపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన జ్యోతిబాపూలే- సావిత్రి బాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఉపాధ్యానులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్ల టౌన్: సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్ జడ్పీహెచ్ఎస్‌లో టీఆర్‌టీఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి టీఆర్‌టీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పూల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్, మండల అధ్యక్షుడు పోతుగంటి రమేష్, ప్రధాన కార్యదర్శి లక్కె లక్ష్మీరాజం, నాయకులు గాజెంగి విష్ణు, పుచ్చిడి పద్మారెడ్డి, దుమాల శైలజా, ఇప్పలపల్లి శ్రీలత, భ్రమరాంబిక సుప్రియ, వైష్ణవి దేవి, సౌమ్య పాల్గొన్నారు.


సుద్దాలలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు


నివాళులర్పిస్తున్న టీఆర్‌టీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

● సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో సావిత్రీ బాయి పూలే జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటం వద్ద బీఎస్పీ నాయకులు పూలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వర్ధవెల్లి స్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేందర్, ఉపాధ్యక్షుడు గుగులోతు చందునాయక్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తడుక భాను, తంగళ్ళపల్లి మండల అధ్యక్షుడు గుండు ప్రేమ్‌కుమార్, ఎల్లారెడ్డి మండల అధ్యక్షురాలు నీరతి భాను, నాయకులు అరుకల రమేష్, అంజన్న, భాస్కర్, సందీప్, సతీష్, వేణు, అరుణ్ పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్లో ఆర్ట్ టీచర్ గా పనిచేస్తున్న సూక్ష్మ కళాకారుడు గాలిపల్లి చొలేశ్వర్ రావి ఆకుపై సావిత్రిబాయి పూలే చిత్రాన్ని చిత్రీకరించాడు. సావిత్రిబాయి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన ఆమె చిత్రపటాన్ని రావి ఆకుపై చిత్రీకరించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్ రాజేష్‌తో పాటు ఉపాధ్యాయ బృందం చోలేశ్వర్ అభినందించారు..

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే 193 జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు రవి, ముఖేష్, మమత, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం సుద్దాల ప్రభుత్వ పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎస్ఎంసీ చైర్మన్ ఎర్రవెల్లి విజయ్, హెచ్ఎంలు మంజులదేవి, రవీందర్, ప్రజాప్రతినిధులు అంగూరి రంజిత్ కుమార్, దుప్పల ప్రవీణ్ పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం నిర్వహించారు. మండల కేంద్రంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సావిత్రీబాయి పూలే చిత్ర పటానికి పూల మాల వేశారు. అనంతరం 30 మంది ఉపాధ్యాయినులను పాఠశాల డైరెక్టర్‌లు సన్మానించారు. కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, డైరెక్టర్‌లు తిపిరెడ్డి వెంకటరెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, పడాల సురేష్, ప్రిన్సిపాల్ హరినాథ్‌రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆర్డర్లతో ఉపాధి చర్యలు చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న మూషం రమేష్

సిరిసిల్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ విధానాలతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోతోందని, మరమగ్గాలు నిలిపివేస్తుండడంతో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, ప్రభుత్వ ఆర్డర్లు ఇచ్చి ఉపాధి చర్యలు చేపట్టాలని పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ అన్నారు. బుధవారం సిరిసిల్లలోని సీఐటీయూ కార్యాలయంలో పవర్‌లూం అనుబంధ రంగాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై సరైన నిర్ణయాలు తీసుకోకపోవడం మూలంగా పెద్ద ఎత్తున సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. సిరిసిల్లలో పాలిస్టర్, కాటన్, ఇతర రకాల వస్త్రాలను బంద్ చేయించిందని, బతుకమ్మ చీరలు ఉత్పత్తి చేయించడంతో సిరిసిల్లతో ప్రైవేటు వస్త్ర పరిశ్రమ మార్కెట్ సంబంధాలు లేకుండా పోయాయని అన్నారు. ప్రభుత్వం మారడంతో ఆర్డర్లు లేక ఉత్పత్తి చేసిన బట్ట మార్కెట్‌లో అమ్ముడుపోలేని పరిస్థితుల్లో టెక్స్‌టైల్ పార్కును మూసి వేశారని, దాదాపు 5 వేల మంది కార్మికుల ఉపాధి నష్టం వాటిల్లిందని అన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ చేపట్టిన పనులను పూర్తి చేయలేదన్నారు. కార్మికులకు వర్కర్ టు ఓనర్ పథకాన్ని పూర్తి చేయలేకపోయారని, బతుకమ్మ చీరలకు సంబంధించి జీవో విడుదల చేయలేదని అన్నారు. ప్రభుత్వ ఆర్డర్లకు సంబంధిచిన బకాయిలు విడుదల చేయించలేదని, కార్మికులకు రావాల్సిన సబ్సిడీ, కరెంట్ సమస్యలు, పరిష్కరించలేదని అన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, వార్పిన్ అధ్యక్షుడు సిరిమల్లె సత్యం, మచ్చ వేణు, ఓగ్గు గణేష్, శశికుమార్, సురేష్, సంపత్, మల్లేశం పాల్గొన్నారు.

గ్యారెంటీల అమలుకు ప్రజాపాలన

గంగాధర, జనవరి 3: ప్రజల కళ్లలో సంతోషాన్ని చూడడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుకు ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం గంగాధర మండలం మధురానగర్, మల్లాపూర్ గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన సదస్సుల్లో ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని మహిళల కళ్లలో సంతోషాన్ని చూడడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రెండు గ్యారెంటీలను అమలు చేశారన్నారు. మిగిలిన వాటిని విజయవంతంగా అమలు చేయడానికి ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అవినీతికి తావులేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందేలా కృషి చేస్తామన్నారు. జడ్పీటీసీ అనురాధనర్సయ్య పాల్గొన్నారు.

రామడుగు: ప్రభుత్వ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని కొరటపల్లిలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆరు గ్యారెంటీ పథకాలను తప్పకుండా నెరవేరుస్తామని హామీ ఇచ్చారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సూర దేవరాజు

సిరిసిల్ల టౌన్, జనవరి 1: హక్కుల సాధన కోసం వడ్డెరులు ఉద్యమించాలని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు సూర దేవరాజు అన్నారు. బుధవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో వడ్డెర సంఘం రాష్ట్ర, జిల్లా ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో దేవరాజు మాట్లాడారు. వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల వెంకటేశం ఆదేశాల ప్రకారం వడ్డెర సంఘం జిల్లా పూర్తి కార్యవర్గాన్ని నియమించినట్లు చెప్పారు. వడ్డెర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సల్లంగుల బాలకృష్ణ, జిల్లా కార్య దర్శిగా వేముల రాములు, జిల్లా సహాయ కార్యదర్శిగా పల్లపు శ్రీనివాస్, జిల్లా సంయుక్త కార్యదర్శిగా గండికోట రమేష్, జిల్లా ప్రచార కార్యదర్శిగా పసుపుల బాల కృష్ణ, గౌరవ అధ్యక్షు డిగా కొమ్ము రాజుల ఐలయ్యను నియమించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా దేవరాజు మాట్లాడుతూ ప్రభుత్వాలు వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చేంత వరకు కార్యవర్గ సభ్యులు కృషి చేయాలన్నారు. మైనింగ్‌లో వడ్డెరులకు రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్ల వెంకటేష్, ఉపాధ్యక్షుడు దండగుల తిరుపతి, రాష్ట్ర నాయకులు పల్లపు రాజేందర్, వేముల వెంకటేష్, కొమ్ము రాజు, దండుగుల సంతోష్, నాగయ్య, ప్రశాంత్, తిరుపతి, వెంకటి పాల్గొన్నారు.

22న దీపావళి పండుగలా చేసుకోవాలి


అక్షింతలను అందజేస్తున్న రాణిరుద్రమ

సిరిసిల్ల టౌన్, జనవరి 3: ఈ నెల 22న అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం నేపథ్యంలో దేశం అంతా దీపావళి పండుగలా చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్ హనుమాన్ దేవాలయం నుంచి అయోధ్య అక్షింతల శోభాయాత్రను ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి అక్షింతలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీరామ తీర్థ ట్రస్టు ఇచ్చిన పిలుపుమేరకు ఈ నెల 22న సిరిసిల్ల ప్రజలు దీపావళి పండుగ చేసుకోవాలన్నారు. 22న ప్రతీ కుటుంబంలోని సభ్యులు దగ్గరలో ఉన్న దేవాలయంలో పూజ, భజన కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. సాయంత్రం చిన్నవారికి అక్షింతలు వేసి ఆశీర్వదించాలన్నారు. ఇంటి ముందు ఐదు దీపాలను వెలిగించాన్నారు. బీజేపీ పట్టణ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: రామజన్మభూమి అక్షింతల ఇంటింటి పంపిణీ భక్తిప్రపత్తుల మధ్య కొనసాగింది. మండలంలోని వంతడుపుల, ఇల్లంతకుంట్ల తదితర గ్రామాలలో బుధవారం రామజన్మభూమి అక్షింతలను ఇంటింటికి తీసుకెళ్లారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైస్ఎంపీపీ సుదగోని శ్రీనాథ్‌గౌడ్, వీహెచ్‌పీ అధ్యక్షుడు ఏగుర్ల శ్రీనివాస్, మామిడి పర్శరాం, బాలరాజు, నార్ల రాంకిషన్, నారెడ్డి కిషోర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అనీల్‌గౌడ్, శ్రీనివాస్, హరీష్, అనీల్, శ్రావణ్, ప్రణయ్, నవీన్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం లింగన్నపేటలో అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్రను బుధవారం నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు శోభాయాత్ర సాగింది.

బాబోయ్.. కుక్కలు

- పోతుగల్‌లో బెంబేలెత్తుతున్న గ్రామస్థులు
- నెల రోజుల్లో మూడు ఘటనలు


కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

ముస్తాబాద్, జనవరి 3 : మండలంలోని పోతుగల్‌లో కుక్కల బెడద తీవ్రమైంది. నెల రోజుల్లో జరిగిన వరుస ఘటనలతో గ్రామస్థులు బెంబేలెత్తుతున్నారు. రోడ్డుపైకి వెళ్లడానికి భయాందోళనకు గురవుతున్నారు. విద్యార్థులను పాఠశాలకు పంపాలంటే తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పలువురు వ్యక్తులు, అటు గొర్రెల మందలపై దాడి చేశాయి.

నెల రోజుల్లో మూడు ఘటనలు

పోతుగల్‌లో గత నెలలో ఒకే రోజు వరుసగా పది మందిపై కుక్క దాడి చేసి గాయపరిచింది. వెంటనే ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. కుక్క విచక్షణ రహితంగా కరవడంతో తీవ్ర గాయాల పాలయ్యారు. పది రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన కుంట్ల పెంటయ్యకు చెందిన గొర్రెల మందపై కుక్కలు దాడి చేయగా పది గొర్రెలు మృత్యువాత పడ్డాయి. లక్షకు పైగా నష్టం వాటిల్లింది. బుధవారం రోజున పోతుగల్‌కు చెందిన గంగల్ల ఐలయ్యకు చెందిన గొర్రెల పాకపై కుక్కలు 20కిపైగా గొర్రెలపై కుక్కలు దాడి చేయడంతో మృత్యువాతపడ్డాయి. దాదాపు రెండు లక్షల నష్టం వాటిల్లింది.

అప్పు చేసి గొర్రెలు కొన్నా

- గంగల్ల ఐలయ్య పోతుగల్



బ్యాంకులో అప్పు చేసి కుటుంబ పోషణ కోసం గొర్రెలు కొనుక్కున్న. సంవత్సర కాలంలో ఒక కిస్తీ కట్టిన . ఇప్పుడు కుక్కల దాడిలో 20 గొర్రెలు చచ్చి పోయాయి. అప్పు ఎలా కట్టాలో తెలియడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి

కుక్కల బారి నుంచి రక్షించాలి

- పెంట్ల బాబు గొర్రెల కాపరి, పోతుగల్



పది రోజుల క్రితం గొర్రెల దొడ్డిపై దాడి చేసి పది గొర్రెలను చంపేశాయి. రూ.లక్ష నష్టం వాటిల్లింది. గొర్రెల నమ్ముకొని జీవనం వెళ్లదీసుకొనే తమను కుక్కల బారీ నుంచి కాపాడాలి. ప్రభుత్వం ఆదుకోవాలి.

'ప్రజాపాలన'ను సద్వినియోగం చేసుకోవాలి


కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గౌతమి

బోయినపల్లి, జనవరి 3 : బోయినపల్లి మండలం రామన్నపేటలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామ సదస్సును స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులందరూ దరఖాస్తు చేసుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎల్లారెడ్డిపేట: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అభయ హస్తం ప్రజాపాలనతో అర్హులందరకీ సంక్షేమ పథకాలు అందనున్నాయని జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్, గొల్లపల్లి, దేవునిగుట్టతండా, కోరుట్లపేట గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు బుధవారం ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రభుత్వం తలపెట్టిన ప్రజా పాలనలో దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. బొప్పాపూర్‌లో 1544, గొల్లపల్లిలో 1456, దేవునిగుట్టతండాలో 105, కోరుట్లపేటలో 441 దరఖాస్తులను స్వీకరించామని అధికారులు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రేణుక, సర్పంచులు బాల్‌రెడ్డి, సరోజన, పెంటయ్య, దేవానందం, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ కృష్ణమూర్తి, ఎంపీటీసీలు గీతాంజలి, శ్రీనివాస్‌రెడ్డి, మధు, తహసీల్దార్ రాంచందర్, ఎంపీడీవో చిరంజీవి, ఆయా శాఖల అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని జంగమరెడ్డిపల్లె, తిప్పాపూర్, పెద్దలింగాపూర్, దాచారం గ్రామాలలో బుధవారం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. అభయహస్తం పథకాల కింద ప్రజల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచులు తూముకుంట శ్రీలతనరేందర్‌రెడ్డి, దమ్మని లక్ష్మిలక్ష్మన్, గొడిశెల జితేందర్‌గౌడ్, పర్శరాం, ఎంపీటీసీలు తీగల పుష్పలత, కరివెద స్వప్నకర్నాకర్‌రెడ్డి, బర్ల తిరుపతి, తహసీల్దార్ జావెద్‌అహమ్మద్, ఎంపీడీఓ మీర్జా, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి తదితరులు పాల్గొన్నారు.


దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ


దరఖాస్తులను స్వీకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

వీర్నపల్లి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలను పేదవారికి అందించాలని సర్పంచ్ పాటి దినకర్, ఎంపీటీసీ అరుణ్ కుమార్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో బుధవారం జరిగిన ప్రజాపాలన గ్రామసభలో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలతో పేదల స్థితిగతులు మారతాయన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో పైరవీలకు తావుండబోదని, ప్రజలు నేరుగా అధికారులను సంప్రదించి అనుమానాలను నివృత్తి చేసుకోవాలని అన్నారు. ఆరు గ్యారెంటీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, మండల కోఆప్షన్ సభ్యుడు ఉస్మాన్, ఉపసర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బోయిని రవి, ఎంపీడీవో నరేష్ కుమార్, నాయబ్ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి పురుషోత్తం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.